సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- అన్ని శాఖల అధికారులతో సమీక్ష

భూపాలపల్లి రూరల్, మే 30 : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో అన్ని శాఖల అధికారులతో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార, డీఆర్డీఏ, సంక్షేమ, అటవీ, ఉద్యాన, వ్యవసాయ, తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమరవీరుల స్తూపం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను పూలతో అందంగా ముస్తాబు చేయాలన్నారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఉద్యాన, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు స్టేజీ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ప్రగతి సందేశాన్ని తయారు చేయాలని డీపీఆర్వోను ఆదేశించారు. విద్యార్థులతో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవోకు సూచించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి నవీన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు పరిశీలించిన సింగరేణి జీఎం

కృష్ణ కాలనీ, మే 30 : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన ఎండీ క్వార్టర్స్ స్టేడియంలో నిర్వహించబోయే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను సింగరేణి భూపాల్‌పల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కాకతీయ స్టేడియంలో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్టేజీని సుందరంగా అలంకరించాలన్నారు. ప్రముఖులకు, అతిథులకు ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ అనుసరిస్తూ సిట్టింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉదయం 7గంటలకు జరిగే తెలంగాణ రన్‌ను విజయవంతం చేయాలన్నారను. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు కవీంద్ర, సివిల్ డీజీఎం రవికుమార్, ఎన్విరాన్‌మెంట్ అధికారి పోషమల్లు, ఎస్ఈలు బాలరాజు, అరుణ్ ప్రసాద్, సెక్యూరిటీ ఆఫీసర్, మురళీమోహన్ పాల్గొన్నారు.

గ్రామ పాలన అధికారుల అర్హత పరీక్షలో శ్రీనివాస్‌కు రెండో ర్యాంకు

బండి శ్రీనివాస్

కృష్ణ కాలనీ/కాటారం, మే 30: ఇటీవల నిర్వహించిన గ్రామ పాలన అధికారుల అర్హత రాత పరీక్షలో రాష్ట్ర స్థాయిలో బండి శ్రీనివాస్ 76వ ర్యాంకు, జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. శ్రీనివాస్ గతంలో కాటారం వీఆర్ఓగా పని చేయగా, ఆ వ్యవస్థ రద్దుతో భూపాలపల్లి మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, గ్రామ పాలన అధికారుల అర్హత రాత పరీక్షలో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో రెండోవ ర్యాంకు సాధించినందుకు మున్సిపల్ కమిషనర్, తోటి ఉద్యోగులు అభినందించారు.

గ్రామ పాలన అధికారుల ఎంపిక

ములుగురూరల్ : ములుగు జిల్లాలో గ్రామపాలన అధికారుల ఎంపికలో భాగంగా ఇటీవల నిర్వహించిన ప్రవేశపరీక్షలో 45మంది ఉత్తీర్ణత సాధించారు. 58మంది అధికారులు పరీక్షకు దరఖాస్తు చేయగా 55మంది హాజరయ్యారు. ఇందులో 45మంది ఉత్తీర్ణత సాధించడంతో వారి ఎంపిక త్వరలో జిల్లాలో పూర్తి కానున్నది.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, మే 30 : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం పథకం కింద 2025- 26 సంవత్సరంలో 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశం కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1వ తరగతిలో 41 సీట్లు, 5వ తరగతిలో 43సీట్లు కేటాయించినట్లు తెలిపారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన అర్హులైన విద్యార్థులు జూలై 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూపాలపల్లిలో జిల్లాలోని గారెపల్లి (కాటారం) ఆదర్శ హై స్కూల్ ఇంగ్లిష్ మీడియం (డే స్కాలర్, రెసిడెన్సియల్), గారెపల్లి (కాటారం) వివేకానంద హై స్కూల్ ఇంగ్లిష్ మీడియం (డే స్కాలర్, రెసిడెన్సియల్), భూపాలపల్లి సెయింట్ పీటర్ హై స్కూల్ ఇంగ్లిష్ మీడియం (డే స్కాలర్), గారెపల్లి (కాటారం) సువిద్య హై స్కూల్ ఇంగ్లిష్ మీడియం (డే స్కాలర్, రెసిడెన్సియల్) గణపురం సీఎస్ఐ ఎడిత్ మెమోరియల్ హైస్కూల్ (డే స్కాలర్)లను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. వివరాలకు జిల్లా ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

లోడు దింపించిన కలెక్టర్

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- మిల్లును పరిశీలించిన రాహుల్‌శర్మ

రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

గణపురం, మే 30 : రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి లారీలలో వచ్చిన ధాన్యం బస్తాలను మాయిశ్చర్ పేరుతో దించకుండా ఇబ్బందులకు గురిచేయడంతో ధాన్యం అంతా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విషయాన్ని ఈనెల 26వ తేదీన ''లోడి త్తినా... దించుకోరాయే'' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం వెలువడింది. కథనానికి భారీ స్పందన లభించింది. స్వయాన కలెక్టర్ రాహుల్‌శర్మ మిల్లుల వద్దకు వచ్చి దగ్గరుండి లారీలలో ఉన్న ధాన్యం బస్తాలను దింపించారు. గణపురం మండలంలోని లక్ష్మి రెడ్డిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, బుర్రకాయల గూడెంలోని జానకీరామ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. లక్ష్మిరెడ్డిపల్లెలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యపు తేమ శాతాన్ని పరిశీలించి నిర్దేశిత శాతం తేమ ఉండే విధంగా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. బుర్రకాయల గూడంలోని జానకీరామ్ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌ని పరిశీలించి మిల్లర్‌తో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యాన్ని వెంట వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. అందుకు తగిన విధంగా హమాలీలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. శుక్రవారం వరకు 12,319 మంది రైతుల నుంచి 74,425 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు విలువ రూ.172.66 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.79.68 కోట్లు చెల్లింపులు జరిగాయని తెలిపారు. కార్యక్రమాల్లో పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సహకార అధికారి వాలియానాయక్ పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతుల ఇబ్బందులు

జాతీయ రహదారి పక్కనే ఉన్న ధాన్యం రాశులు

గోవిందరావుపేట, మే 30 : మండలంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వరకు ఎండ ఉండటం, రాత్రి పూట వర్షం పడటంతో ఎండిన ధాన్యం రాశుల కిందకు నీరు చేరి తడుస్తున్నాయి. దీంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మండలంలోని ఆయా కొనుగోలు కేంద్రాల నుంచి కాంటాలు, లారీల ద్వారా వెళ్లిన బస్తాలను మిల్లర్లు ఏదో ఒక సాకుతో దిగుమతి చేసుకోకపోవడంతో కాంటాలు నిలిచిపోతున్నారు. అటు వర్షం, ఇటు కాంటాలు కాక రైతులు ఆవేదనకు గురవుతున్నాయి.

వాజేడులో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

వాజేడు, మే 30 : మండలకేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. పిడుగుపాటుకు మండలకేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వివిధ వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జూనియర్ లైన్‌మ్యాన్ యగ్గడి వంశీ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఏఎస్పీ

ఏటూరునాగారం, మే 30 : మండలంలోని చిన్నబోయినపల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఏఎస్పీ శివం ఉపాధ్యాయ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రత్యేక చెక్‌పోస్టు పనితీరు, సిబ్బంది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. చెక్ పోస్టు సరిహద్దు దాటి ఎలాంటి అక్రమ రవాణా చేసినా సహించేది లేదని ఏఎస్పీ హెచ్చరించారు. ఇప్పటి వరకు వాహనాల్లో అక్రమంగా తరలుతున్న 256 మూగ జీవాలను పట్టుకున్నట్లు వివరించారు. వీటిని భూపాలపల్లిలోని రాంపూర్ గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీలో సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దిన్ పాల్గొన్నారు.

అవతరణ దినోత్సవ వేడుకకు అతిథి సీతక్క

ములుగురూరల్, మే 30 : జూన్ 2వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేడుకల్లో భాగంగా మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించి ప్రగతి నివేదికను తన ప్రసంగం ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు.

సఖీ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు

ములుగురూరల్, మే 30 : ములుగు జిలా కేంద్రంలోని సఖీ వన్ స్టాప్ సెంటర్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని మాట్లాడారు. సఖీ సెంటర్‌కు వచ్చే మహిళలకు, బాలికలకు న్యాయపరమైన సూచనలు ఇస్తూ బాధితులకు మనోధైర్యం ఇచ్చి న్యాయం, వైద్య పరమైన సహకారం అందించాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ చీఫ్ లీగల ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్ పోక్సో చట్టాలు, ఉచిత న్యాయం పొందే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏజీపీ బాలుగు చంద్రయ్య, డీసీపీవో ఓంకార్, సైకాలజిస్టు కిరణ్‌కుమార్, డాక్టర్ నమ్రత, కృష్ణవేణి, సంధ్య, నరేశ్, సంజీవ పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా బందు

రేగొండ, మే 30 : మండల కేంద్రంలోని గడిపల్లెలో నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సరఫరా లేదని ఆధికారులు నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా చేయకపోడంతో తాగునీటి కోసం ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. గ్రామ కార్యదర్శి ఒక రోజు కూడా తమ గ్రామానికి రాకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సరఫరా ఎందుకు కావడం లేదని అడిగితే ఎవరికి వారే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని ప్రజలు అంటున్నారు. గతంలో కూడా రెండురోజులకు ఒకసారి నీటి పరఫరా ఉండేదన్నారు. ప్రస్తుతం మంచినీటి కోసం ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రం పరిస్థితే ఇలా ఉందంటే గ్రామాల పరిస్థితి చెప్పనక్కరలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మెమోలు తీసుకెళ్లాలి

భూపాలపల్లి రూరల్, మే 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జనవరి 2025లో నిర్వహించిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షల డ్రాయింగ్, టైలరింగ్ లోయర్, హయ్యర్ మెమోలు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలోఉన్నాయని డీఈవో ఎం రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు రాసిన అభ్యర్థులు ఆధార్‌జిరాక్స్, హాల్‌టికెట్ జిరాక్స్ వెంట తీసుకుని వచ్చి మెమోలు తీసుకొని వెళ్లవచ్చని ఆయన తెలిపారు.

ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

వాజేడు, మే 30 : మండలంలోని ధర్మవరం గ్రామంలో పట్టా ల్యాండ్ ఇసుక ర్యాంపు పేరుతో గుత్తేదారు నిబంధనలు అతిక్రమించి పట్టాల్యాండ్ నంబర్లలోని భూమిలో కాకుండా గోదావరిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, వారి పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు జెజ్జరి దామోదర్ శుక్రవారం తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనుమతులు పొందిన పట్టా ల్యాండ్ గోదావరి ఒడ్డుపై ఉన్నాయన్నారు. ఆ ల్యాండులో కాకకుండా గుత్తేదారు గోదావరిలోని ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇసుక ర్యాంపులో పనికల్పించాలని ఆందోళన

వాజేడు మండలంలోని ధర్మవరం గ్రామంలో నిర్వహిస్తున్న ఇసుక క్వారీలో తమకు పనికల్పించాలని కోరుతూ భువనపల్లి వే బ్రిడ్జి సమీపంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం భువనపల్లి గ్రామస్తులు ఇసుకలారీలను అడ్డుకున్నారు. గంటల తరబడి లారీలు వెళ్లకుండా ఆపడంతో డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పేరూరు పోలీసులు అక్కడికి చేరుకుని లారీలను ఆపవద్దని, ఇసుక ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో లారీలు వెళ్లిపోయాయి.

టమాట పెట్టెల మాటున పశువుల తరలింపు

పట్టుబడిన వ్యాను వద్ద ఏఎస్పీ, సీఐ, ఎస్సైలు

పట్టుకున్న పోలీసులు కేసు నమోదు

ఏటూరునాగారం, మే 30 : భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల నుంచి హైదరాబాద్‌కు డీసీఎం(టీఎస్05యుఎఫ్ 2690) వ్యానులో తరలిస్తున్న 17పశువులను పోలీసులు శుక్రవారం ఉదయం చిన్నబోయినపల్లి వద్ద పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. అందిన సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం ఉదయం వాహన తనిఖీ చేపట్టారు. పక్కా సమాచారంతో పై నంబరు గల డీసీఎంను తనిఖీ చేయగా ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయి. పశువులను తరలించేందుకు పక్కా ప్లాన్ చేశాడు. పశువులు బయటకు కన్పించకుండా సదరు వ్యాపారి టమాటా బాక్సులు అమర్చారు. పోలీసులు బాక్సులను తొలగించడంతో డీసీఎం లోపలి వైపు ఉన్న పశువులు కన్పించాయి. డీసీఎంలో 17పశువులను కిక్కిరిసి ఊపిరాడకుండా బంధించారు. చర్ల పరిసర ప్రాంతాల్లో పశువులను కొనుగోలు చేసి ఎలాంటి రహదారి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారనే విషయం వెలుగు చూసింది. డీసీఎంను అదుపులోకి తీసుకున్న తర్వాత ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వెంటనే చర్యలకు ఆదేశించారు. భూపాలపల్లిలోని రాంపూర్ గోశాలకు పశువులను పంపించారు. అక్రమంగా తరలిస్తున్న సూర్యాపేట సమీపంలోని చేనుపల్లికి చెందిన లారీ డ్రైవర్ పెరుమాండ్ల లక్ష్మణ్, యజమాని సెట్టూరి రామకృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దిన్ తెలిపారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాస్, పోలీసులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న తాటికొండ రాజయ్య

మొగిళి అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

కృష్ణ కాలనీ, మే 30 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని సుభాష్‌కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు, బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి అర్బన్ మహిళా నాయకురాలు నేరుపాటి రజిత భర్త నేరుపాటి మొగిళి రేగొండ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శుక్రవారం సుభాష్‌కాలనీలోని మృతుడు మొగిళి ఇంటికి వెళ్లాడు. మొగిళి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్, 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ముంజంపల్లి మురళీధర్, మాజీ జడ్పీటీసీ ల ట్ట రాజబాబు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీబీ చారి, కట్ట నరసింహచారి, దాసరి బ్రహ్మారెడ్డి, కలవల రాజమౌళి పుల్యాల తిరుపతి, సోన్నాయిల సుభాష్, రాజేందర్, బండారి మధు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘాలను బలోపేతం చేయాలి

గణపురం, మే 30 : అంబేద్కర్ సంఘాలను బలోపేతం చేసేందుకు యువత ముందుకు రావాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మతోన్మాదుల నుంచి రక్షించుకోవడానికి యువత ముందుకు రావాలన్నారు. గ్రామ కమిటీలు వేసి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శంకర్ గౌడ్, ఎస్సీఎస్టీ అట్రాసిటీ నంబర్ రాసపెల్లి భద్రయ్యలు కమిటీ సభ్యులను మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కమిటీలను ఆదివారం ఎన్నుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎల్లస్వామి, దూడపాక దుర్గయ్య, ముప్పిడి శంకర్, దూడపాక శ్రీనివాస్, ఎలకపెల్లి రమేశ్, కుమ్మరి రవి, దూడపాక పున్నం, ఇంజపెల్లి రవికుమార్, కనకం తిరుపతి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వేసవి కార్యాచరణ విజయవంతం

కృష్ణ కాలనీ, మే 30 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వేసవి కార్యాచరణ ప్రణాళికా విజయవంతంగా అమలు చేశామని టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ బీ మల్సూరునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం నవంబర్ నెల నుంచి వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకొని, అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడం వలన విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించామన్నారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్న చోట్ల 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని వివరించారు. అదేవిధంగా ఇప్పటివరకు 76కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేశామని, 39 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామన్నారు. హెచ్చుతగ్గులు లేకుండా లైన్‌లలో ఎనిమిది 600కేవీఏఆర్ కెపాసిటర్ బ్యాంకులు క్షేత్రస్థాయిలో పెట్టినట్లు తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి
- ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

అంకుసాపూర్‌లో రైస్ మిల్లును పరిశీలిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, మే 30 : ప్రభుత్వ అనుమతి లేని, నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ జీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న విత్తనాల ప్యాకెట్లను పరిశీలించి వాటి రసీదులను, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీలర్లు విక్రయించే విత్తనాలు, ఎరువులకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. లేదంటే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు ఇతరత్రా కొనుగోలు చేసే సమయంలో బస్తా రసీదును జాగ్రత్తగా గమనించాలనీ, గుర్తింపు కలిగిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలనీ, నిషేధిత హెచ్‌టీ, బీజీ-3 పత్తి విత్తనాలు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. పైగా ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. కాగా, కొందరు ఆంధ్రప్రాంతానికి చెందిన వారు వచ్చి నిషేధిత పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లు డీఎస్పీ దృష్టికి తీసుకవచ్చారు. తనిఖీల్లో ఆయన వెంట ఎస్సై అభినవ్, ఏవో పూర్ణిమ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఎస్పీ

కాటారం : గారెపల్లిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు అంకుసాపూర్‌లోని అన్నపూర్ణ రైస్‌మిల్లును శుక్రవారం కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై అభినవ్, పీఏసీఎస్ సీఈవో ఎడ్ల సతీశ్, సిబ్బంది ఉన్నారు.

విత్తన వ్యాపారులకు అవగాహన సదస్సు

రేగొండ : విత్తన విక్రయ వ్యాపారులు నకిలీ విత్తనాలు, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రేగొండ ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో విత్తన వ్యాపారులు, ఫర్టిలైజర్ షాపు యజమానులకు పోలీస్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం షాపులను తనిఖీ చేసి, విత్తనాల నిల్వ, అమ్మకాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్‌కుమార్, వ్యవసాయ అధికారి పెద్ది వాసుదేవరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవోలు, వ్యాపారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీ..

మహాముత్తారం : మండలంలోని కొర్లకుంట ములుగుపల్లి, ముత్తారం, యామన్‌పల్లిలోని ఫర్టిలైజర్ షాపులను కాటారం సీఐ నాగార్జునరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయిస్తున్న తీరును, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. ఆయనతోపాటు ఎస్సై మహేందర్‌కుమార్, ఏవో అనూష ఉన్నారు.

సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

ములుగురూరల్, మే 30 : సంక్షేమ పథకాల లబ్ధిదారులతోపాటు రైతులకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు, రైతులకు ఆటంకాలు లేకుండా బ్యాంకర్లు రుణాల మంజూరీలో సహకరించాలని అన్నారు. రాజీవ్ యువ వికాస లబ్ధిదారుల జాబితా బ్యాంకులకు వచ్చిన వెంటనే యూనిట్లను గ్రౌండింగ్ చేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి గోమతి, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, హెచ్‌బీఐ రిజనల్ మేనేజర్ సుబ్బారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, బీసీ సంక్షేమశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, డీసీవో సర్దార్‌సింగ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్

కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్ సంపత్

ములుగురూరల్, మే 30 : ములుగు మున్సిపాలిటీ కమిషనర్‌గా జే సంపత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ములుగు గ్రామపంచాయతీ కార్యాలయంలో డీపీవో దేవరాజు సమక్షంలో విధుల్లో చేరారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమి